మల్లేపల్లిలో మ్యాన్‌హోల్స్ పైకప్పుల నిర్మాణం

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో పగిలిపోయిన మ్యాన్ హోల్స్ పైకప్పులను తొలగించిన జీహెచ్‌ఎంసీ సర్కిల్-12 ఇంజినీరింగ్ విభాగం అధికారులు కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. కాగా ఈ పనులను బుధవారం ఈఈ లాల్‌సింగ్ ఆదేశాలతో డీఈ శ్రీనివాస్ పూర్తి చేయించారు.

– మెహిదీపట్నం డిసెంబర్ 4

ఎంఈడీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: ఓయూ పరిధిలోని ఎంఈడీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యూలర్, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను 18 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని తెలిపారు.

ఎండీహెచ్‌ఎం పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4 : ఓయూ పరిధిలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్‌ఎం) కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షా ఫీజును ఈనెల 9లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. పరీక్షలను నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

గోషామహల్‌లో ట్రాఫిక్ సమస్యపై సమీక్ష

● అధికారులు, ప్రజాప్రతినిధులతో నగర కమిషనర్ సీవీ ఆనంద్ సమావేశం

సమీక్షా సమావేశంలో పాల్గొన్న గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, నాయకులు, అధికారులు

అబిడ్స్, డిసెంబర్ 4 : గోషామహల్ డివిజన్ పరిధిలో తరచూ ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యపై పాత కమిషనర్ కార్యాలయం చెత్తా బజార్‌లో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అధ్యక్షతన ట్రాఫిక్ ఉన్నతాధికారులు, పాతబస్తీ ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోషామహల్ డివిజన్‌లోని ట్రాఫిక్ సమస్య విషయమై కార్పొరేటర్ లాల్‌సింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. గాంధీ విగ్రహం నుంచి బోయిగుడా కమాన్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. అదే విధంగా గాంధీ విగ్రహం నుంచి భూలక్ష్మీ మాత ఆలయం వరకు ఫుట్‌పాత్ కబ్జాలను తొలగించి రోడ్డును విస్తరించాలని కోరారు. జుమ్మెరాత్ బజార్ నుంచి జియాగూడా 100ఫీట్ల రోడ్డు వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, నయాపూల్ మధ్యలో నూతన ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, ట్రాఫిక్ సీఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో చాంపియన్‌షిప్

హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్- 24 పోటీల్లో టీవీవే తైక్వాండో అకాడమీకి చెందిన అక్షయ తైక్వాండో గ్రాండ్ చాంపియన్ షిప్ కప్ సాధించారు. పోంసె, క్యోరుగీ విభాగంలో టీవీకే తైక్వాండో అకాడమి విద్యార్థులు రెండు బంగారు, రెండు సిల్వర్ పతకాలు సాధించారు. కరాటే గ్రాండ్ మాస్టర్ కంటే సత్యశంకర్ పతకాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో టీవీకే తైక్వాండో అకాడమి ఫౌండర్ వేణుకుమార్ పాల్గొన్నారు. – ముషీరాబాద్

శబరిమలకు.. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఇరుముడి కట్టుకుని శబరిమలకు బయల్దేరిన అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, డిసెంబర్ 4 : అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బుధవారం శబరిమలకు బయల్దేరి వెళ్లారు. అయ్యప్ప మాల ధరించిన ఎమ్మెల్యే తన దీక్షను పూర్తి చేసుకుని బాగ్‌అంబర్‌పేటలోని గురువాయూర్ శ్రీకృష్ణ మందిర్(అయ్యప్ప టెంపుల్)లో ఉదయం ఇరుముడి కట్టుకొని అయ్యప్ప దర్శనానికి వెళ్లారు. ఆయన వెంట గురుస్వాములు శేఖర్‌రెడ్డి, ఈశ్వర్, దిలీప్‌రాజ్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బన్సీలాల్‌పేట్ : విద్యార్థులందరూ తమ దృష్టిని విద్యపైనే ఉంచాలని, వీలైనంతవరకు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ సీమా సిక్రి అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 8,9,10 వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కొత్త పద్ధతుల్లో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్ట్‌ల పలు సంగతుల వివరాలు చెప్పారు. వాటి బారిన పడకుండా సెక్యూరిటీ పద్ధతులను ఎలా అవలంభించాలో తెలిపారు. సెల్‌ఫోన్‌లో వచ్చే లింక్‌లను తెరిచి, సైబర్ నేరస్తుల వలలో చిక్కి లక్షల రూపాయలను నష్టపోతున్న విధానాలు ఆమె వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బంగ్లాదేశ్ ప్రభుత్వానిది.. ప్రేక్షకపాత్ర'

చిక్కడపల్లి : బంగ్లాదేశ్‌లో హిందువులపై నరమేధం సాగుతున్నా.. ప్రేక్షక పాత్ర వహిస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ కమిటీ సభ్యుడు బాగయ్య మండిపడ్డారు. హిందూ ఐక్య వేదిక (భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి) ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ హిందూవులకు మద్దతుగా బుధవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద సంఘీభావ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ కమిటీ సభ్యుడు బాగయ్య హాజరయ్యారు. అంతర్జాతీయ సమాజం ముందుకు వచ్చి ఒత్తిడి తేవాలని కోరారు. ఇస్కాన్ స్వామి చిన్మోయ్‌కృష్ణదాస్‌జీని విడుదల చేయాలన్నారు. వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చినజీయర్ స్వామి ఆశ్రమం ఉత్తరాధికారి దేవనాథ జీయర్ స్వామి, స్వామి నారాయణ నీలకంఠం విదాయపీట్ కు చెందిన హరిదర్శన్ స్వామిజీ, స్వామి దుర్గానందపూరి స్వామిజీ, బనారస్ బాబు స్వామీజీ, ఎమ్మెల్యే రాజాసింగ్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్ రెడ్డి, సుందర్ రెడ్డి, వీహెచ్‌పీ నాయకులు రామరాజు పాల్గొన్నారు.

'ప్రజా పాలన కాదు.. పీడించే పాలన'

అడ్డగుట్ట : కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజా పాలన కాదు.. ప్రజలను పీడించే పాలన అని బీఆర్‌ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండ వేణి రాజేశ్‌గౌడ్(పెద్దన్న) బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రజలకు పాట్లు తప్పా.. మిగిలేది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పరీక్షలను నిర్వహించిన వాటికి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నియమక పత్రాలు అందజేసి మా ప్రభుత్వమే ఉద్యోగాలిచ్చిందని చెప్పుకోవడం సిగ్గు చేటు అని అన్నారు.

కులగణన , మూసీ సుందరీకరణతో ప్రజలకు ఉపయోగం లేదన్నారు. రైతుబంధు ఇస్తామని చెప్పి.. ప్రస్తుతం ఊసే ఎత్తడం లేదని, ఐటీ రంగం పూర్తిగా కుదేలు అయిందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదని ఆయన విమర్శించారు.

బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి

మాట్లాడుతున్న బీసీ దళ్ జాతీయాధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి, తదితరులు

కాచిగూడ, డిసెంబర్ 4: కేంద్ర ప్రభుత్వం జనాభా ధామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంట్‌లో రాజ్యంగ సవరణ చేయాలని బీసీ దళ్ జాతీయాధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో బీసీ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం వైఫలమైందని విమర్శించారు. కులగణనపై బీజేపీ మంత్రులు, ఎంపీలకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రధానిపై ఒత్తిడి తేవాలన్నారు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మాదిరిగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్లమెంట్, అసెంబ్లీల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.గోపాల్‌రావు సేవలు చిరస్మరణీయం

గోపాల్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హిందూ శ్మశానవాటిక ట్రస్ట్ బోర్డు సభ్యులు

కాచిగూడ, డిసెంబర్ 4: నింబోలిఅడ్డా మాజీ కార్పొరేటర్, 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ కన్వీనర్, ఏకే భవన్ అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు(79) సేవలు చిరస్మరణీయమని హిందూ శ్మశానవాటిక ట్రస్ట్‌బోర్డు సభ్యులు పేర్కొన్నారు. హర్రస్‌పెంటలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం ఎస్.గోపాల్‌రావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌పటేల్, రాజ్‌కుమార్‌విగ్, సాయిగిరిధర్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ కోసం అనేక మార్లు లాఠీ దెబ్బలు తిని జైలుకెళ్లిన వ్యక్తి గోపాల్‌రావు అని పేర్కొన్నారు. కేసీఆర్ స్ఫూర్తితో తెలంగాణ మలి ఉద్యమంలోనూ పాల్గొని, హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడిగా, తెలంగాణ అరేకటిక(సూర్యవంశీ) సంఘం అధ్యక్షుడిగా, కాచిగూడ కబేళా గౌరవాధ్యక్షుడిగా మాజీ ఫ్లోర్‌లీడర్‌గా సేవలందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీరాస్వామి, విజయ్ కుమార్, సత్యనారాయణ, అనిల్, నందకిశోర్‌యాదవ్, బి.కృష్ణాగౌడ్, డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు, కిట్టు, మహేందర్, నరోత్తమరెడ్డి, అభిమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రజల న్యాయ పరిష్కారం కోసం నిర్వహించనున్న లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని తెలంగాణ స్టేట్ లీగల్ సెల్ అథారిటీ ప్రత్యేక సభ్యుడు పీ. రామారావు పోలీస్ అధికారులను కోరారు. బుధవారం హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్‌ను ఆయన మార్యదపూర్వకంగా కలిసి లోక్ అదాలత్ వివరాలను తెలియజేశారు. ఈ నెల 14న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

– మెహిదీపట్నం డిసెంబర్ 4

రైలు ఢీకొని కూలి మృతి

కాచిగూడ, డిసెంబర్ 4: పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని కూలి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. కాటేదాన్ బాబుల్ రెడ్డినగర్‌కు చెందిన శ్రీపతి కుమారుడు గోవింద్(38) కూలిగా పనిచేస్తున్నాడు. బుధవారం శివరాంపల్లి-ఫలక్‌నామ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో గోవింద్ అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

బేగంపేట్, డిసెంబర్ 1: కన్జూమర్ గ్రీవెన్సెస్ సమావేశాన్ని ప్యారడైజ్ విద్యుత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 : 30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నామని ప్యారడైజ్ విద్యుత్ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. సమావేశానికి సీజీఆర్‌ఎఫ్ చైర్ పర్సన్, టెక్నికల్ సభ్యులు, ఫైనాన్స్ సభ్యులు, కన్జూమర్ ఎఫైర్స్ హాజరవుతారని తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

సికింద్రాబాద్ : సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కార్పొరేటర్ హేమ బుధవారం సందర్శించారు. పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. భోజనం ఎలా? ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు కార్పొరేటర్. ఉపాధ్యాయులతో మాట్లాడి.. పిల్లలకు పౌష్టిక ఆహారం అందేలా చూడాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాటలు వినాలని, లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్‌కి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయలక్ష్మి, స్టాఫ్ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ప్రతి తల్లికి ఉత్తమ సంరక్షణ అందించడమే లక్ష్యం

ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సీ. శ్రీనివాస్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్ పర్సన్, ఎండీ ఎవిటా ఫెర్నాండెజ్

అబిడ్స్,డిసెంబర్ 4. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి తల్లికి ఉత్తమ సంరక్షణ అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సీ. శ్రీనివాస్ అన్నారు. మాతా, నవజాత శిశువుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకుగాను బుధవారం పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ శ్రీ సత్యసాయి హెల్త్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ పరిశోధనా విభాగం ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ మేరకు శ్రీసత్యసాయి ట్రస్ట్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్ పర్సన్, ఎండీ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్‌లు ఎంవోయూలపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సంధర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మనందరిదీ ఒకే లక్ష్యమని, వెనుకబడిన వర్గాల గర్భిణులు, నవజాత శిశువులు, కుటుంబాలకు ఉత్తమమైన సంరక్షణ అందించడమేనన్నారు. గర్భధారణ, ప్రసవ సమయం,ప్రసవానంతరంతో పాటు శిశువు జీవితంలోని ప్రారంభ వారాల వరకు ఈ సంరక్షణను అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఎండీ ఎవిటా ఫెర్నాండెజ్ మాట్లాడుతూ స్త్రీ కేంద్రీకృతమైన ప్రసవ పద్ధతులకు మార్గదర్శకత్వం వహించింది ఫెర్నాండెజ్ ఆసుపత్రి అని అన్నారు. గర్భధారణ,ప్రసవ విషయంలో మహిళలు స్వతహాగా నిర్ణయం తీసుకునే స్వేచ్ఛనిచ్చిందన్నారు. ప్రసవ సమయంలో అవసరమైన వైద్య జోక్యాలను తగ్గించడానికి మిడ్‌వైఫరీ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందన్నారు. మిడ్‌వైఫరీ ప్రొగ్రామ్‌ను విజయవంతం చేయాలని కోరుకుంటున్నామన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు

కంటోన్మెంట్ రెండో వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మహ్మద్ యాసీన్ బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. కంటోన్మెంట్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లుగా తెలిపారు. - బొల్లారం

కార్వాన్‌లో అయ్యప్ప పూజ

కార్వాన్‌లోని సంతోష్ గురుస్వామి సన్నిధానం అధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో మాలధారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అయ్యప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

– కార్వాన్, డిసెంబర్ 4

కార్వాన్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు

గుడిమల్కాపూర్ హోల్‌సేల్ మార్కెట్‌లో రిటైల్ వ్యాపారులు తిష్ట వేయడంపై బుధవారం హోల్‌సేల్ వ్యాపారులు కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహినుద్దీన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. రిటైల్ వ్యాపారుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మార్కెట్‌లో పర్యటిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

– మెహిదీపట్నం డిసెంబర్ 4

గండి మైసమ్మ ఆలయంలో పూజలు

కంటోన్మెంట్ ఒకటో వార్డు న్యూ బోయిన్‌పల్లి చిన్న తోకట్ట గండి మైసమ్మ ఆలయంలో బుధవారం పూజలు, హోమం నిర్వహించారు. బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు కొండల్ యాదవ్, ముఖేశ్ యాదవ్, అరుణ్ యాదవ్, గోపాల్, జాజుల క్రాంతి, రాజేశ్, జంగిలి రాజు, యాదయ్య పాల్గొన్నారు. - బొల్లారం

విశ్వకర్మ సంఘం నియోజకవర్గ నూతన కమిటీ

అంబర్‌పేట నియోజకవర్గ విశ్వకర్మ సంఘం నూతన కమిటీ సభ్యులు

కాచిగూడ, డిసెంబర్ 4: అంబర్‌పేట నియోజకవర్గ శ్రీ విశ్వకర్మ సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా నాగారం భాస్కరాచారి, అధ్యక్షుడిగా గొట్టాల వినోద్‌కుమార్‌చారి,ప్రధాన కార్యదర్శిగా పోలోజు వేణుగోపాల్, కోశాధికారిగా కృష్ణమాచారి, సలహాదారులుగా అంజయ్యచారి, సంజీవచారి, పి.శ్రీహరిచారి, డి.ఎల్లయ్య, సంపత్‌కుమార్ నియమితులయ్యారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, తెలంగాణ విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షుడు కృష్ణమాచారి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విశ్వకర్మలంతా ఒక్క తాటిపైకి వచ్చినప్పుడే ఆర్థికంగా, రాజకీయంగా ముందడుగు వేయవచ్చని సూచించారు. ప్రభుత్వం విశ్వకర్మ సంక్షేమానికి నిధులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇతర కులాలకు ఇచ్చే రాయితీలు విశ్వకర్మలకు కల్పించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. రవికిరణ్, ఆనంద్‌గౌడ్, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

7న విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక

కాచిగూడ, డిసెంబర్ 4: విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ యువత కోసం ఈనెల 7న రామంతాపూర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామన్నారు. యువతీ యువకులు పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9848199744, 9491888266 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

6న ఆలయ పాలక మండలి ప్రమాణం

మారేడ్‌పల్లి, డిసెంబర్ 4 : శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పాలక మండలి నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని 6వ తేదీన ఆలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు నూతన పాలక మండలి సభ్యుడు రేపాల వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో విలేకర్ల సమావేశంలో నూతన పాలక మండలి సభ్యుల పేర్లను వెల్లడించారు. సభ్యులుగా నర్సింగ్‌రావు, ఎం. రాంమోహన్, పరమేశ్, పద్మజ, బాల్‌రాజ్,శ్రీనివాస్, ఎక్స్‌ఆఫిషియల్ సభ్యుడు రాజేశ్వర శర్మ పేర్లు ప్రకటించారు.

'అరుణోదయ సభలు జయప్రదం చేయండి'

ఉస్మానియా యూనివర్సిటీ: అరుణోదయ 50 వసంతాల సభలను విద్యార్థులు, యువకులు, కవులు, కళాకారులు, మేధావులు, కర్షకులు, కార్మికులు జయప్రదం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సభలను 14, 15 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. సభకు సంబంధించిన కరపత్రాలను ఓయూ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా బుధవారం ఆవిష్కరించారు. ప్రొ. జయధీర్ తిరుమలరావు, విమలక్క మాట్లాడుతూ.. అరుణోదయ పురుడుపోసుకున్న ఇంజినీరింగ్ కళాశాలలో సభ కరపత్రం ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కట్టా భగవంతరెడ్డి, మల్సూర్, రమేశ్ పోతుల, విజయ్, ప్రభాకర్, రాకేశ్, నాగిరెడ్డి, యలవర్తి ధనలక్ష్మి, మోత్కూరి శ్రీను, రామ సత్తన్న, సాయన్న, రాము పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ముషీరాబాద్ : జోశ్యుల మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఘంటసాల 102 జయంతిని పురస్కరించుకొని బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను సన్మానించారు. వడ్లకొండ వెంకట్ రావు, వెంకట్రావు, రమాశంకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.